క్లుప్తంగా

కనుల పండువగా పుష్పయాగం



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి తిరునక్షత్రం సందర్భంగా శనివారం ఉదయం విశేషంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మాధవ స్వామి బృందం పుష్పాభిషేకం చేపట్టారు. పుష్పాభిషేకంలో అనేక రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలు, స్వామికి తులసీ దళాలతో కనుల పండువగా పుష్పయాగం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

వెంకటస్వామి నాయుడు చిరస్మరణీయుడు

లక్ష్మీపురం: అర్ధ శతాబ్ది పాటు సంగీత ప్రియులను పలు కచేరిలతో అందరిని అలరిస్తు ఆనందాన్ని చేకూర్చి అనేక బిరుదులు పొందిన వెంకటస్వామి నాయుడు సదా చిరస్మరణీయుడని కళా సాధ అధ్యక్షుడు బిళ్లా అశోక్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షతన మనమూ పాడుదం రండి బృందం ఫిడేలు నాయుడు జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంగీత విద్వాంసుడు ఎస్.ఎన్.మల్లేశ్వరరావు మాట్లాడారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



లక్ష్మీపురం: అరండల్‌పేట 1వ లైన్ రైల్వే స్టేషన్ వద్ద పడి పోయిన గుర్తు తెలియని వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. రైల్వే స్టేషన్ వద్ద శనివారం ఉదయం ఓ గుర్తు తెలియని వృద్ధుడు పడి పోయి ఉన్నాడు. దీన్ని గమనించిన స్థానికులు అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో చికిత్సకు తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధుడు (75) మృతి చెందాడు. గుర్తు తెలియని మృతి కింద కేసు నమోదు చేశారు. మృతుడి వివరాల తెలిసిన వారు పోలీస్ స్టేషన్ నంబర్ 0863-2231995, ఎస్‌ఐ రోజాలత 8688831334 నంబర్‌కు సమాచారం తెలియజేయాల్సిందిగా కోరారు.

రెచ్చిపోతున్న బైక్ రేసర్లు



రేసర్ ఢీకొట్టడంతో దెబ్బతిన్న మరో బైక్

లక్ష్మీపురం/పట్నం బజార్: నగరంలో రేసర్లు శనివారం రాత్రి రెచ్చిపోయారు. అడ్డువచ్చిన వాహనదారులను ఢీకొట్టారు. స్థానికులు తెలిపిన వివరాలు.. గుజ్జనగుండ్ల మీదుగా రింగు రోడ్డు వైపుగా బైక్ రేసర్ అతి వేగంగా వస్తున్న బైక్ రేసర్ వాహనానికి ఒక కుటుంబం యాక్టివా పై వెళుతున్న వారిని తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టింది. డివైడర్‌తో పగిలి పోయింది. తీవ్ర గాయాలు పాలైన కుటుంబ సభ్యులపై బైక్ రేస్ వచ్చిన యువకుడు వాగ్వాదానికి దిగి వారిపై దాడి చేసినట్లు సమాచారం. దీంతో కొంత సేపు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ నిలిచి పోయింది. దీన్ని గమనించిన స్థానికులు పట్టాభిపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పోలీసులు చేరుకుని బైక్ రేస్ చేస్తున్న యువకుడిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

ఉచిత ఇసుక పాలసీపై ధర్నా రేపు

లక్ష్మీపురం: ఉచిత ఇసుక పాలసీ నడిపించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మిక సంఘం(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ తెలిపారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని భవన నిర్మాణ కార్మికుల అడ్డలో శనివారం కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



లక్ష్మీపురం: పేదలపై విద్యుత్ చార్జీల భారాన్ని ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి డిమాండ్ చేశారు. నల్లచెరువు వద్ద ఉన్న విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యుత్ చార్జీలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ లాంతర్‌లతో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నెలలు కూడా పూర్తి కాక ముందే విద్యుత్ చార్జీలు పెంచడం దారుణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు లింగంశెట్టి ఈశ్వరరావు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ కూచిపూడి విజయ పాల్గొన్నారు.

అడ్డగోలుగా అనుమతులు

- నగరంలోకి పట్టపగలే భారీ వాహనాలు
- నిబంధనలకు తిలోదకాలిచ్చిన ట్రాఫిక్ పోలీసులు
- ప్రమాదాలు జరిగితే పరిస్థితి ఏంటీ...?



పాతగుంటూరులో ఉదయం 11 గంటల సమయంలో సరుకు అన్‌లోడ్ చేస్తున్న లారీలు



బ్రహ్మానందరెడ్డి స్టేడియం వద్ద సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్న దృశ్యం



అల్లీనగర్‌లో రోడ్డును పూర్తిగా ఆక్రమించి ట్రాక్టర్ నిలిపిన వైనం

పట్నంబజారు: నగరం పాత గుంటూరులోని ఓ సన్నని సందు.. ఉదయం తొమ్మిది గంటల నుంచి ఒక ట్రాక్టర్ నిలబెట్టి.. ఒక నివాసంలో ఉన్న డస్ట్‌ను లోడ్ చేస్తున్నారు.. అదే సమయంలో అటుగా వెళ్లే వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే వాహనాలు, ఉద్యోగులు అయినా కనీసం పక్కకి జరగని ట్రాక్టర్ వాలా.. ఇదేంటయ్యా అని ప్రశ్నిస్తే.. పోలీసులే పెట్టుకోమన్నారయ్యా.. మీరేంటి ఇక్కడ పక్క నుంచి పోండి అంటూ.. ట్రాక్టర్‌లో ఉన్న వ్యక్తుల దౌర్జన్యం. బాహాటంగా.. బహిరంగంగా... ఉదయం వేళ తిరిగేందుకే ట్రాఫిక్ పోలీసులకు డబ్బులు కడుతున్నామని.. ఆ ట్రాక్టర్‌లో ఉన్న వ్యక్తులు అన్న మాటలకు అన్న ఉన్న వారంతా అవాక్కైన పరిస్థితి. నేరుగా ఒక ట్రాఫిక్ అధికారికే ట్రాక్టర్ వ్యక్తి ఫోన్ చేసి ఎవరో.. ఫొటోలు తీస్తున్నారంటూ.. చెప్పటం గమనార్హం. ఆ విషయం పక్కన పెడితే... నిబంధనలు పట్టించుకోకుండా.. ఇష్టానూసారంగా ఎటువంటి అనుమతులు లేకుండా తిరిగేస్తున్నారు.. చేతిలో సెల్‌ఫోన్.. ఒక చేతిలో స్టీరింగ్‌తో స్టేషన్‌కు కూతవేటు దూరంలో వెళుతున్నారు.

గత ప్రమాదాలు ఇలా..

గత కొద్ది రోజుల క్రితమే అమరావతి రోడ్డులో ఒక మున్సిపాలిటీ లారీ ఢీకొని ఒక మెడికల్ రిప్రజంటేటివ్ మృతి చెందాడు. ప్రభుత్వ పనులకు సంబంధించిన పూర్తి స్థాయిలో అనుమతులు ఉంటాయి. ఉదయం 8 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు గుంటూరు నగరంలో లారీ, కంటైనర్, ట్రాక్టర్, టిప్పర్‌లు వంటి రాకూడదని నిబంధనలు స్పష్టంగా ఉన్నాయి. గత కొద్ది కాలం క్రితం ఏకో పార్క్ దగ్గర సాయంత్రం ఐదు గంటల సమయంలో ఒక మహిళను ఒక వాహనం ఢీకొట్టి వెళ్లింది. అయితే దానిని హిట్ అండ్ రన్‌గా కేసు నమోదు చేసిన పోలీసులు చేతులు దులుపుకున్నారు. అక్కడ స్థానికులు మాత్రం టిప్పర్ గుద్దిందని స్పష్టంగా చెబుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఈ మధ్య కాలంలోనే సాయంత్రం వేళలో బాపట్లకు చెందిన ఆర్టీసీ బస్సు స్టేడియం వద్ద 77 సంవత్సరాల వృద్ధురాలిని ఢీకొట్టంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఇవి కాకుండా అనేక వాహనాలు ఢీకొట్టడంతో మృతి చెందిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. సమయ వేళలు లేకుండా భారీ వాహనాలు రోడ్డుపైకి రావటంతో జరిగే ప్రమాదాలకు ఇవి నిలువెత్తూ నిదర్శనం. అయినా ట్రాఫిక్ అధికారుల్లో మాత్రం ఎటువంటి చలనం కనపడటం లేదు. నిత్యం ఇసుక, ఇటుక, ఆయా నివాసాల్లో చెత్తాచెదారం తీసివేసేందుకు ట్రాక్టర్‌లు, టిప్పర్‌లు వస్తున్నప్పటికీ కనీసం పట్టించుకోని పరిస్థితులు ఉన్నాయి. సాక్ష్యాత్తూ... పోలీసుస్టేషన్‌ల ఎదుటే.. ఆయా పాయింట్‌లలో సిబ్బంది ముందుగానే వెళుతున్నప్పటికీ నిలువరించే వారే కరువైయ్యారు.

నగరంలోకి ఇలా...

గుంటూరు నగరంలోకి 24/7 భారీ వాహనాలు తిరుగుతూనే ఉన్నాయి. పార్సిల్ సర్వీసులు మొదలుకుని, ఇసుక, ఇటుక, ఇతర నిత్యవసర వస్తువుల లారీ యథేచ్ఛగా వస్తున్నాయి. ముఖ్యంగా పట్నం బజారు ప్రాంతంలో ఇదీ నిత్యకృత్యమే. అమరావతి రోడ్డు, ఇన్నర్ రింగు రోడ్డు, పొన్నూరు రోడ్డు, కాకానిరోడ్డు, చుట్టుగుంట ప్రాంతాలవైపులా ఇసుక లారీలు, టిప్పర్‌లు, ట్రాక్టర్‌లు తిరుగుతున్నా.. అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో ఉన్న ఆంతర్య బహిరంగ రహస్యమే. జేకేసీ కళాశాల రోడ్డు, గుజ్జనగుండ్ల మీదుగా నిత్యం తిరుగుతున్నా.. కనీసం కేసులు నమోదు చేస్తున్న పాపాన పోవటంలేదు.

ఇష్టారాజ్యంగా...

నగరంలో ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భారీ వాహనాలు నగరంలోకి ప్రవేశించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ.. అధికారులు, సిబ్బంది కాసుల మోజులో పడి వాతటిని వదిలేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. పైపెచ్చు టోకెన్ సిస్టమ్ పెట్టి మరీ నెలవారీ మామూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా స్టేషన్‌లలోని సిబ్బంది ద్వారానే వసూళ్ల పర్వానికి తెరదీస్తున్నారనే వాదనలు లేకపోలేదు. దీంతో టిప్పర్, లారీ, ట్రాక్టర్ అసోసియేషన్ నేతలు ఎక్కడైనా వాహనం ఆపితే.. నేరుగా సదురు అధికారులకే ఫోన్ చేసి మరీ వాహనాన్ని తీసుకుని వెళుతున్న పరిస్థితులు కనపడుతున్నాయి. గుంటూరు ఈస్ట్ పరిధిలోని కాకాని రోడ్డులో ఒక ప్రాంతం నుంచి వారానికి నాలుగు సార్లు పలు ధపాలుగా 50పైగా లారీలు లోడ్‌ను ఎత్తుకుని ఇతర ప్రాంతాలకు చేరవేస్తున్నారని చెబుతున్నారు. పట్నంబజారు, లాలాపేట పరిసర ప్రాంతాల్లో నిత్యం లారీలు సరుకు రవాణా కోసం వస్తూనే ఉన్నాయి. ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయాలు నగరంలోకి నిత్యం కళ్యాణం వచ్చ తోరణం అన్న చందంగా వస్తూనే ఉన్నాయి. పట్నంబజారు ప్రాంతాన్ని పర్యవేక్షించే ఎస్‌ఐ స్థాయి అధికారి, ఆయన అసిస్టెంట్ నెలవారీ మామూళ్ల ఒప్పందాలు కుదుర్చుకోవటంతో, పాయింట్‌లలో విధులు నిర్వర్తించే పోలీసులు చూసీచూడనట్లు పోవాల్సివస్తోంది.

భారీగానే వసూలు...

నిత్యం నగరంలో అడ్డుఅదుపూ లేకుండా వాహనాలు తిరిగేందుకు భారీ వాహనాల అసోసియేషన్‌ల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారనే ఆపవాదులను ట్రాఫిక్ పోలీసులు మూటగట్టుకుంటున్నారు. ట్రాక్టర్ నుంచి రూ.1500, టిప్పర్ నుండి రూ.2000, లారీకి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారనే వాదనలు ఉన్నాయి. ఈ క్రమంలో కాకాని రోడ్డులో నుంచి వచ్చే లారీలకు మాత్రం ప్రత్యేక ప్యాకేజీ నడుస్తోందని పోలీసు వర్గాల్లో చర్చ నడుస్తోంది. సుమారుగా ఆయా ప్రాంతాల నుంచి ఇసుక, ఇటుక తీసుకుని వచ్చే ట్రాక్టర్లు 150పైగా ఉన్నాయని, ట్రాన్స్‌పోర్ట్ లారీలు, ఇతర లారీలు కలిపి అవి కూడా 120 నుంచి 150 వరకు ఉండే అవకాశం ఉందని, టిప్పర్‌లు సైతం 50పైగా తిరిగుతున్నాయని తెలుస్తోంది.

అవినీతికి పాల్పడితే చర్యలు తీసుకుంటాం



నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలు ఉదయం వేళల్లో నగరంలోకి వస్తే ఉపేక్షించం. ఎట్టి పరిస్థితుల్లో కచ్చితంగా కేసులు నమోదు చేస్తాం. సమయ వేళలు ఉల్లంఘించి భారీ వాహనాలు వస్తే.. వాటిపై కేసులు నమోదు చేయటంతో పాటు, కచ్చితంగా జరిమానాలు విధించి, సీజ్ చేస్తాం. సిబ్బంది అవినీతికి పాల్పడినట్లు తెలిస్తే.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం.

–ఎం.రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ

ఎల్‌వీఆర్ క్లబ్‌లో నాటకోత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: గుమ్మడి శ్రీమన్నారాయణ కళా సమితి, వైకె నాగేశ్వరరావు కళాపరిషత్ సంయుక్తంగా కొరిటెపాడు ఎల్.వీ.ఆర్. క్లబ్‌లోని వేదికపై రెండు రోజులపాటు నిర్వహించనున్న నాటకోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఎల్‌వీఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు వణుకూరి శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి కొండ్రగుంట శ్రీనివాసరావు, నటుడు నాయుడు గోపి, కాపూరి సత్యనారాయణ, అల్లూరి రామ లింగయ్య పరిషత్ అధ్యక్షులు శివప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కాట్రగడ్డ రామకృష్ణ, బొప్పన నరసింహారావు ఆధ్వర్యంలో జరగ్గా, హర్ష క్రియేషన్స్(విజయవాడ) ఆధ్వర్యంలో దివంగత డాక్టర్ పి.బ్రహ్మానందం రచన, కత్తి శ్యాంప్రసాద్ దర్శకత్వం వహించిన మనః సాక్షి సాంఘిక నాటిక ప్రదర్శించారు. పిల్లా నటరాజ్ పర్యవేక్షణలో సందేశాత్మకంగా సాగింది. అనంతరం ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్(ఒంగోలు) సూదునగుంట వెంకటేశ్వర్లు రచన, దర్శకత్వం వహించిన హెచ్చరిక సాంఘిక నాటిక ప్రదర్శించగా, మంచి సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో డి.తిరుమలేశ్వరరావు, జి.మల్లికార్జునరావు, జానీబాషాలు పాల్గొనగా, అతిథులను, కళాకారులను సత్కరించారు.

అలరించిన సంగీత కచేరి

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం రాత్రి ముత్తుస్వామి దీక్షితుల సంగీత మహోత్సవం జరిగింది. గాయత్రి మహిళా సంగీత సన్మండలి అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి అధ్యక్షత వహించారు. విశ్రాంత లెక్చరర్ కేవీ బ్రహ్మానందం(విజయవాడ), రేడియోలజిస్ట్ డాక్టర్ సుజాత జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. డాక్టర్ వై.రమాప్రభ దీక్షితార్ కతి సంగీత కచేరి జరగ్గా, ముత్తుస్వామి దీక్షితార్ కతులకు సోదాహరణాత్మక వివరణ యిస్తూ గానం చేశారు. ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, పి.లలితాదేవి, కార్యదర్శి ఎ.మంగాదేవి, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణ పాల్గొనగా, కళాకారులను అతిథులను సత్కరించారు.

కిక్ బాక్సర్ కోటిని అభినందించిన పెమ్మసాని



కోటిని అభినందిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని

గుంటూరు వెస్ట్(క్రీడలు): గత నెలలో కాంబోడియాలో నిర్వహించిన ఏషియన్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యంతో సహా రెండు పతకాలు సాధించిన యాసం కోటి నాగబాబును కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ఆయన కార్యాలయంలో అభినందించారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ప్రపంచకప్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు కోటి ఎంపికయ్యాడు. రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ విధానంలో క్రీడాకారులకు ఎంతో లబ్ధిచేకూరుతుందన్నారు. యువత క్రీడలను ప్రొఫెషనల్‌గా స్వీకరించాలన్నారు. అత్యంత క్లిష్టతరమైన కిక్ బాక్సింగ్‌ను ఎంచుకుని దాంట్లో రాణిస్తున్న కోటి యువతరానికి ఆదర్శమన్నారు. ప్రపంచకప్ పోటీల్లో కోటి రాణించాలని ఆకాంక్షించారు.

ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, జనాభా అవసరాల దృష్ట్యా ప్రధాన డ్రెయిన్లు, రోడ్ల ఆక్రమణల తొలగింపు చేపట్టినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం అమరావతి రోడ్, నంది వెలుగు రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్, నలంద నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత కమిషనర్ అమరావతి రోడ్డులో డ్రెయిన్, రోడ్లపై ఆక్రమణలను పరిశీలించి, ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో సిల్ట్ తీయాలని అధికారులకు సూచించారు. ఒకసారి తొలగించిన ఆక్రమణలు తిరిగి ఏర్పాటు చేయకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. బస్టాండ్ ఎదురు ఆక్రమణలు తొలగించడంతో పాటు ప్రకటనల హోర్డింగ్స్ డ్రెయిన్‌కు ముందుకు రాకూడదని, వెంటనే తొలగించాలని కోరారు. ఆక్రమణదారులకు రెండు రోజుల్లో తొలగించుకోవాలని ముందుగా తెలియ చేసి, సోమవారం నుంచి పూర్తి స్థాయిలో తొలిగించడానికి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సదరు ప్రాంతంలోని రైతు బజార్ కి వచ్చే వినియోగదార్ల వాహనాలు రైతు బజార్ ప్రాంగణంలోనే పార్క్ చేసేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. నందివెలుగు రోడ్డు విస్తరణ చేసినప్పటికీ ఆక్రమణలు వలన ఉపయోగం లేకుండా ఉందని, తక్షణం ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకొని తొలగించాలని ఏసీపీని ఆదేశించారు. బస్టాండ్ ఎదుట ట్యాక్సీ వాలాలు, ఆటో డ్రైవర్లతో వాళ్ల స్టాండ్‌లో నేరుగా మాట్లాడుతూ బస్టాండ్ ప్రాంతంలో అధిక ట్రాఫిక్ ఉంటుందని, ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని పేర్కొన్నారు. అనంతరం నలంద నగర్‌లో స్థానిక కార్పొరేటర్ మానం పద్మశ్రీ కలసి పర్యటించి, ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. నలంద నగర్ మెయిన్ రోడ్ లో కల్వర్ట్ కుంగి పోవడం వలన మురుగు సక్రమంగా వెళ్లడంలేదని, తక్షణం నూతన కల్వర్ట్ నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అపార్ట్మెంట్ల ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా పట్టణ ప్రణాళిక అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యటనలో ఈఈలు కోటేశ్వరరావు, సుందరరామిరెడ్డి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఏసీపీ రెహామ్మన్, జాతీయ వినియోగదార్ల సమాఖ్య ఉపాధ్యక్షుడు డాక్టర్ సిహెచ్.హరిబాబు, డీఈఈ రమేష్, ఏఎంహెచ్‌ఓలు ఆనందకుమార్, రాంబాబు పాల్గొన్నారు.

కృత్రిమ మేధపై వర్క్‌షాప్

గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ఎంబీఏ విభాగ ఆధ్వర్యంలో కృత్రిమ మేధపై రెండు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఈసందర్భంగా వివిధ కళాశాలల నుంచి 85 మంది ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్న వర్క్‌షాప్‌లో పరిశ్రమలకు చెందిన అనుభవజ్ఞులైన రిసోర్స్ పర్సన్లు కృత్రిమ మేధపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించి వెబ్ డిజైనింగ్ చేయడంతో పాటు చాట్ బాట్ లింక్, ఆటో రెస్పాన్సివ్ మెకానిజాన్ని ఇంటిగ్రేట్ చేసే విధానాన్ని కేవీ సుబ్బారావు విద్యార్థులతో చేయించారు. యూఎస్‌కు చెందిన సీనియర్ సాఫ్ట్‌వేర్ మేనేజర్‌గా పని చేస్తున్న చిన్మయి మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, రోబోటిక్స్‌పై జూమ్ ద్వారా నిర్వహించారు. డాక్టర్ పృధ్వీరాజ్ కృత్రిమ మేధపై ఓరియంటేషన్, ఇంట్రడక్షన్ చేశారు. లిట్మస్ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ సాయి కిరణ్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, ఎంబీఏ విభాగాధిపతి రాజ్యలక్ష్మి, అధ్యాపకురాలు శశికళ మాట్లాడారు. వర్క్‌షాప్‌లో ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ వి.చక్రవర్తి విద్యార్థులకు గైడెన్స్ కల్పించారు.

ఘనంగా మేడ్ రాష్ట్ర మహాసభ

నెహ్రూ నగర్: మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయీస్ (మేడ్) రాష్ట్ర 7వ మహాసభ గుంటూరులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరై మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మేడ్ కృషి చేయడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మేడ్ ముందు వరసలో ఉంటుందన్నారు. అనంతరం 2024 నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మెడికల్ సీట్లు సంపాదించిన దళిత విద్యార్థులను ఈ సందర్భంగా సన్మానించారు.

రేపు వీధి వ్యాపారులతో ప్రత్యేక సమావేశం

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారం కొరకు సోమవారం సాయంత్రం 5 గంటలకు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో వీధి వ్యాపారుల సంఘాలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని ప్రధాన రోడ్లు అంతర్గత రోడ్లు వివిధ డ్రెయిన్లపై వీధి వ్యాపారులు తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ప్రధాన డ్రెయిన్ల పూడిక తీత పనులకు ఆటంకం ఏర్పడుతున్నందున తేలిక పాటి వర్షానికే రోడ్లు వర్షం నీరు నిలబడి ప్రజలు అవస్థలు పడుతున్నారని, మురుగు నీరు పారుదలకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. నగర పాలక సంస్థ దశల వారీగా నగరంలోని డ్రెయిన్ ఆక్రమణల తొలగింపు చేపట్టామని పేర్కొన్నారు. ఆక్రమణల తొలగింపు వీధి వ్యాపారుల సమస్యలపై చర్చించడానికి సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశానికి వీధి వ్యాపార సంఘాల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు నగరంలో పాక్షికంగా తాగునీటి సరఫరా

నెహ్రూనగర్: నగరానికి తాగు నీరు సరఫరా చేసే ప్రధాన పంపింగ్ కేంద్రాలైన ఉండవల్లి, తక్కెళ్లపాడు ప్లాంట్ల వద్ద శనివారం విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సరఫరాలో ఆటంకం ఏర్పడటంతో ఆదివారం నగరంలో తాగు నీటి సరఫరా పాక్షికంగా జరుగుతుందని నగర పాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగమల్లేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరానికి కృష్ణా బ్యారేజి వద్ద ఉండవల్లి పంపింగ్ కేంద్రం నుంచి మంగళగిరి పంపింగ్ ద్వారా తక్కెళ్లపాడు పంపింగ్ కేంద్రాలకు ముడి నీటి సరఫరా జరుగుతుందని చెప్పారు. రెండో శనివారం సందర్భంగా విద్యుత్ శాఖ వారు మరమ్మతుల నిమిత్తం సరఫరా నిలిపివేయడంతో విద్యుత్ అంతరాయం వలన తాగు నీటి సరఫరాలో ఆటంకం ఏర్పడినందున నగరంలోని రిజర్వాయర్ల నుంచి తాగునీటి సరఫరా ఆదివారం పాక్షికంగా జరుగుతుందని, ప్రజలు నగర పాలక సంస్థకు సహకరించాలని, ఆదివారం సాయంత్రం నుంచి తాగు నీటి సరఫరా యథావిధిగా జరుగుతుందని చెప్పారు.

ఆదాయానికి గండి కొడితే చర్యలు తప్పవు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



సాక్షి
కూటమి జేబుల్లో మార్కెట్ ఆశీలు

శనివారం సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో ఆశీలను నగరపాలక సిబ్బందికి మాత్రమే చెల్లించి రశీదు పొందాలని, దళారులు వసూళ్లకు వస్తే నేరుగా నగర పాలక సంస్థ కాల్ సెంటర్‌కి కాల్(0863-2345103) చేసి ఫిర్యాదు చేస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. 'కూటమి జేబుల్లో మార్కెట్ ఆశీలు' అనే కథనం 'సాక్షి'లో ప్రచురితమైంది. దీనిపై కమిషనర్, రెవెన్యూ అధికారులపై సీరియస్ అయినట్లు సమాచారం. నగరపాలక సంస్థకు చెందిన వివిధ మార్కెట్లు, సైకిల్ స్టాండ్‌లు, మరుగుదొడ్ల వద్ద నుంచి ఆశీలు వసూలుకు గతంలో పాటదార్ల గడువు ముగిసినందున, నూతనంగా టెండర్ కం ఓపెన్ ఆక్షన్ ఆమోదం కోసం నగరపాల సంస్థ స్థాయి సంఘానికి పంపామన్నారు. ఆమోదం వచ్చే వరకు జీఎంసీ సిబ్బందే డిపార్ట్‌మెంట్ వసూలు చేస్తున్నారన్నారు. నగరంలోని నగరపాలక సంస్థకు ఆశీలు చెల్లించే వారు కేవలం నగరపాలక సంస్థ ఐడీ కార్డ్‌తో, జీఎంసీ ఆధీకృత రశీదు అందించే వారికే ఆశీలు ఇవ్వాలని తెలిపారు. నగరపాలక సంస్థకు చెందిన కొల్లి శారద హోల్ సేల్ కూరగాయల మార్కెట్, పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్, పాల ఆసుపత్రి వద్ద కూరగాయల మార్కెట్, అరండల్ పేట 1వ లైన్‌లోని పచ్చ గడ్డి మార్కెట్, సంద్రీస్ మార్కెట్‌లో వ్యాపారుల నుంచి, పీవీకే నాయుడు మార్కెట్ ఉత్తర, దక్షిణం వైపు ఫెన్సింగ్‌లో, వెస్ లాక్ మార్కెట్‌లో సైకిల్ స్టాండ్‌లు, ఎన్టీఆర్ బస్టాండ్, కృష్ణా పిక్చర్ ప్యాలెస్ సెంటర్, బండ్ల బజార్ వద్ద, గాంధీ పార్క్ వద్ద, విజ్ఞాన మందిరం రోడ్ లోని, తహసీల్దార్ (వెస్ట్) కార్యాలయం వద్ద, పాల ఆసుపత్రి వద్ద, నాజ్ సెంటర్ వద్ద ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ రుసుంను జీఎంసీ సిబ్బందే వసూలు చేస్తున్నారని, ఏ విధమైన దళారులకు ఆశీలు చెల్లించవద్దని కమిషనర్ తెలిపారు. నగరపాలక సంస్థ ఆయా ప్రాంతాల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల ఆధ్వర్యంలో అడ్మిన్ కార్యదర్శులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకొని, నగరపాలక సంస్థ నిర్దేశించిన రుసుం వసూలు చేసి, సంతకం చేసిన రశీదును అందించాలన్నారు. ఆశీలు వసూలుపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, రోజువారీ వసూళ్ల వివరాలను అందించాలన్నారు. డెప్యూటీ కమిషనర్ ఆశీలు వసూళ్లపై క్షేత్ర స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు.

మార్కెట్‌లోకి బజాజ్ ఫ్రీడమ్ 125 సీసీ బైక్ విడుదల



బైక్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక అమరావతి రోడ్డు శ్రీసిద్ధి వినాయక బజాజ్ షోరూంలో ఫ్రీడం 125 సీసీ పెట్రోల్, సీఎన్‌జీ ఆప్షన్లతో ఉన్న మోటారుసైకిల్‌ను శనివారం మార్కెట్‌లోకి విడుదల చేశారు. ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ(ఆటోనగర్) బ్రాంచ్ మేనేజర్ జె.శివరాంప్రసాద్ మాట్లాడుతూ బజాజ్ కంపెనీ ఎప్పటికప్పుడు కొత్త మోటారుసైకిళ్లను రూపకల్పన చేయడంలో ముందు ఉంటుందని అన్నారు. ప్రస్తుతం 125 సీసీ పెట్రోలు కం సీఎన్‌జీ ఆప్షన్లతో మార్కెట్‌లోకి వచ్చిందని చెప్పారు. కొనుగోలుదారులు ఎక్కువ బైక్‌లను కొనాలని అన్నారు. షోరూం జనరల్ మేనేజర్ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఫ్రీడం 125 సీసీ డ్రం, ఎల్‌ఈడీ, డిస్క్ ఎల్‌ఈడీలతో లభ్యమవుతుందని అన్నారు. దీని షోరూం ధర రూ.94,995 నుంచి ప్రారంభమవుతుందని చెప్పారు. పొడవాటి, సౌకర్యవంతమైన సీట్లతో లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో గుంటూరు టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణ, జుబేర్ మేస్త్రీ, షోరూం టీం లీడర్ యోగేంద్ర, సాయి పాల్గొన్నారు.

18న తపాలా ఏజెంట్ల నియమాకానికి ఇంటర్వ్యూలు

లక్ష్మీపురం: స్థానిక చంద్రమౌళినగర్ పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఈనెల 18వ తేదీ తపాలా భీమా ఏజెంట్ల నియమాకానికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు గుంటూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ యలమందయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పోస్టల్ డివిజన్ పరిధిలో జీవిత బీమా గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాల కోసం కమిషన్ విధానంలో ఏజెంట్లుగా పని చేసేందుకు ఇంటర్వ్యూలకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఏజెంట్లుగా పనిచేసే వారికి కనీస అర్హత పదో తరగతి, ఇంటర్మీడియెట్ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గుంటూరు నగరంలోని చంద్రమౌళినగర్ పోస్ట్ ఆఫీస్ ప్రాంగణంలోని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావల్సిందిగా కోరారు. నియమించబడిన అర్హత కలిగిన అభ్యర్థులకు రూ.5వేలు సెక్యూరిటీ డిపాజిట్‌గా 5 సంవత్సరాల నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్ రూపంలో పూచికత్తు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. రూ.5 వేలు కూడా ఏజెన్సీ రద్దు చేసుకున్న సమయంలో జాతీయ పొదుపు పథకం వడ్డీ రేటుతో సహా తిరిగి చెల్లిస్తుందని తెలిపారు. ఇతర వివరాలకు 0863-2255978, 2255078 నంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.